


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్టులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబ్లమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి-అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళుగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# గుండమ్మ కథ - 16

దుర్గమ్మ,భూపతి గుండమ్మ ఇంటికి వస్తారు. గుండమ్మ, లక్ష్మి హాల్లో సోఫాలో కూర్చుని వుంటారు.

గుండ: ఏమే? మళ్ళీ ఎందుకు వచ్చావు?

దుర్గ: ఎందుకు రాను? నా డబ్బు, నా నగలు ఏం చేశావ్?

గుండ: నీ డబ్బు, నీ నగలుఎ౦విటే?

దుర్గ: నా నగలేనే. —ఇద్దరూ: ఛీ ఊరుకో-ఛీ ఊరుకో.

లక్ష్మి: అట్టే వాగేవంటేనా-పళ్ళు రాలగొడతాను.

భూపతి: పడెయ్యండి ముందు డబ్బు. నా సంగతి తెలుసుగా? —బాణాకర్ర తిప్పుతాడు.

గుండ: అల్లుడుగారూ. —దుర్గమ్మ గుండమ్మని,లక్ష్మిని బయటికి తోస్తుంది. — భూపతి కర్ర తిప్పుతాడు.

భూప: ఏయ్ అల్లుడూ-దిగిరా. డొక్క చించేస్తా. డోలుకట్టేస్తా.——పైనుండి అంజి చొక్కా చెయ్యి మడతపెడుతూ, సూటులో దిగివస్తాడు. మెట్లు దిగిన అంజితో——

భూప: నువ్వేనేంటీ అల్లుడుగారివి? —అంజి బుజంపై దెబ్బవేస్తే అంజి నిస్సహాయంగా నోరుతెరిచి చూస్తాడు.

భూప: తెలిసిందా ఈ భూపతి సంగతి? హహ్హహ్హ. —అంజి బెదిరినట్లు నటిస్తాడు.

దుర్గ: కసిగా——తన్ను.చచ్చేటట్టు తన్ను. —అంజి దెబ్బలు కాసుకుంటూ తిరిగి భూపతిని ఓ పట్టు పడతాడు. (తన్నులాటలో కొంత హాస్యం) కుస్తీపట్లలో అంజిది పైచెయ్యి ఔతుంది. ఆశ్చర్యపోతున్న దుర్గమ్మని గుండమ్మ,లక్ష్మి గదిలోకిలాగి ఒకనూకు నూకుతారు. గంటన్న సహాయకుడితో ప్రవేశిస్తాడు. అంజి దెబ్బలకి భూపతి నేలకూలుతాడు.

అంజి: ఏం గంటన్నా? నువ్వూ తినడానికే వచ్చావా?

గంటన్న: లేదు.ఆంజనేయప్రసాద్ గారూ, ఆసుపత్రికి మోసుకుపోదామని. —సహాయకుడికి చెప్పి భూపతిని బైటికి పంపుతాడు. :అంజితో: ఇంకా ఎందుకునాయనా మిగిల్చావు? (కొడుకుని తల్చుకుని) లక్షణంగా జైల్లోవుండక ఎందుకొచ్చిన ఖర్మరా ఇదీ?

దుర్గమ్మ: గుడ్డలన్నీ చింపేశారు. రక్తం!——సోఫా రెక్కపై సూటు నలగకు౦డా కూర్చున్న అంజితో: చూశావానాయనా? ఎలా రక్కిపెట్టారో?

అంజి: పోయిరామాయమ్మ పోయిరావమ్మా (పెట్టె అందించి) మా ఇల్లు చల్లగా... లక్ష్మి దుర్గమ్మని బైటికి నెట్టి——వెళ్ళమ్మా.

గుండమ్మ: దెబ్బలేమైనా తగిలాయా అల్లుడుగారూ?

అంజి:.తప్పుతప్పు. నన్ను అల్లుడుగారూ అనిపిలిస్తే నిన్ను అత్తయ్యగారూ అని పిలవాలి. నువ్వు అంజీ అను. నేను గుండత్తా అంటాను.

గుండ: ఇంక ఈ కొంపలో ఉండలేను. నేనుకూడా మీ ఊరొచ్చేస్తాను. తీసుకెళ్ళు.

అంజి లక్ష్మిని కళ్ళతో అడుగుతాడు నవ్వుతూ.

లక్ష్మి: అలాగే తీసుకెళ్దాం. రాపిన్నీ.

గుండ: అమ్మ.నాతల్లే. నా తల్లి నా అమ్మా. —లక్ష్మి,అంజి మందహాసం చేస్తారు.

★★★

గార్డెన్ హౌస్‌లో నేలపై పక్కలపై పడుకున్న భార్యా భర్తలు. సరోజలేచి మంగళసూత్రాలు కళ్ళకద్దుకుని భర్త పాదాలకి నమస్కరించి వెళ్తుంది. రాజా కళ్ళు తెరిచి పక్కకితిరిగి పడుకుంటాడు. --సరోజ స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేస్తుంది.-- అద్దంవద్ద జుత్తు ఆరబెట్టుకుని జడవేసుకుంటుంది. పక్క గదిలో రాజాలేచి: సరోజా.సరోజా. —సరోజవచ్చి--ఏవి౦టండీ?

రాజా: కూర్చో.ఇవాళ మనం పనిలోకి వెళ్ళడం లేదు. Complete rest.

సరో: పన్లోకి వెళ్ళకపోతే వాళ్ళు ఊరుకుంటారా?

రాజా: ఎందుకూరుకోరు? ఇవాళ ఆదివారంగా? లేచి భుజాలుపట్టుకుని ప్రేమగా కళ్ళల్లోకి చూస్తూ: ఇవాళ నాకో కోరిక కలిగింది. చెప్పనా?

సరో: చెప్పండి.

రాజా: నేను గారెలు తినాలి.

సరో: ఇంట్లో మినప్పప్పు లేదండీ.

రాజా: బజారెళ్ళి తీసుకురా.

సరో: డబ్బులేదు.

రాజా: కూలిడబ్బు అడిగి తీసుకో.

సరో: నెలకానిదే వాళ్ళిస్తారా?

రాజా: ఎందుకివ్వరు-కష్టపడి చేసే వాళ్ళకి? డబాయించి వసూలుచెయ్యి.

సరో: మరి నాకు వాళ్ళ ఇల్లు తెలీదే?

రాజా: వెంకన్నని తీసుకెళ్ళు. (అలవాటుగా)వెంకన్నా? (సర్దుకుని) వెంకన్నగారూ?

వెంకన్న: ఆఁ.వస్తున్నా.

ఆజా: మీ అయ్యగారితో చెప్పి జీతం ఇప్పించు. —వెంకన్నతో సరోజ బయల్దేరుతుంది. : త్వరగావెళ్ళిరా. నాకు ఆకలిగావుంది. గారెలు వెయ్యి.

★★★

బంగళాలో సోఫాలో కూర్చుని రామభద్రయ్య పేపరు చదువుతూ వుంటాడు. —వెనకనుండి వెంకన్న, సరోజలు వస్తారు. —వెంకన్న:బాబూ.

రా.భ: ఆఁ.

వెంక: అమ్మాయి కూలిడబ్బులకి వచ్చింది.

రా.భ: చూడు. పనిమనిషి రాలేదు. (Humiliation as a test) సరోజ బండెడు గిన్నెలుతోమి చీర చెరగుకి చేతులు తుడుచుకుంటూ వస్తుంది.

రా.భ: ఇవాళ చిల్లర డబ్బులు లేవు. గంజికాచుకుంటుందేమో, కాసిని నూకలిచ్చి పంపించు.

వెంక: అమ్మా.

సరో: నాకు నూకలక్కరలేదు.డబ్బుకావాలి.

రా.భ: ఎందుకో?

వెంక: చెప్పమ్మా.

సరో: అభిమానపడుతూ——గారెలు వండుకోవాలి.

ఆ.భ: గారెలు? అన్నాలులేక అందరూ చస్తుంటే గారెలు కావలసివచ్చిందా నీకు?బాగుంది వరస.

సరో: కోపంతో రగిలిపోతూ——మేం గారెలు తింటే మీకేం? బూరెలు తింటే మీకేం?కష్టపడ్డాం. మా కూలిడబ్బులు మాకు పారెయ్యండి.

రా.భ: అబ్బో. చాలా దూరం వచ్చిందే? —లేచి నిలబడతాడు. —ఇద్దరూ పరస్పరం చూసుకుంటారు. సరోజ బిత్తరపోయి తలదించుకుంటుంది.

రా.భ: నిన్ను ఎక్కడో చూసినట్టుందే?

సరో; నేను గుండమ్మగారి కూతుర్ని.

రా.భ:ఆఁఆఁ. జ్ఞాపకం వచ్చింది. జ్ఞాపకం వచ్చింది. ఎక్కడాగతిలేక చివరికి ఈ కూలివాణ్ణి చేసుకున్నావన్నమాట.(ఎకసక్కెం-దెప్పిపొడుపు –మాటలతో ఈటెలపోటులు)

సరో: గతిలేకేంకాదు. కోరి చెసుకున్నాను.

రా.భ: ఎంతో గారాబంగా పెరిగినదానివి. చివరికి కూలి చేసుకునే గతిపట్టింది నీకు. (సానుభూతి-వెటకారం)

సరో: నాకేం గతిపట్టలేదు. కాయకష్టం చేసుకుని స్వతంత్రంగా బతకడం చాలా గౌరవం. ఇందులో మేం బాధపడవలసిందీ, మీరు జాలిపడవలసిందీ పనిలేదు. మేమెంతో హాయిగావున్నాం.

రా.భ: ఆహాఁ. అదితెలిస్తే మా అబ్బాయికే ఇచ్చి చేసుకునేవాళ్ళం కదా?

సరో: (స్వాభిమానంతో) చాల్లెండి. పెళ్ళయిన ఆడపిల్లని గురించి అలా మాట్లాడడం భావ్యం కాదు. పెద్దవారు. మర్యాద ఇచ్చిపుచ్చుకోండి.

రా.భ: మెత్తబడి——అదికాదమ్మా నా ఉద్దేశం. మా ఇంటి కోడలివైతే సుఖపడివుండే దానివికదా అని.

సరో: ఏం? మీది కలిగిన ఇల్లనా? మాకూవుంది ఆస్తి. మనుషులకి కావలసింది కలిసిన మనసులుకాని కలిగిన ఆస్తులుకావు. నా భర్తకోసం మా అమ్మనీ ఆస్తినీ వదులుకుని వచ్చాను.

రా.భ: అబ్బో!చాలా మారిపోయావే? నీ రోషం ఏమైంది?(ఆటపట్టింపు)

సరో: నేనేం మారలేదు. నా రోషం అలాగేవుంది. నేను వెనకటి సరోజను. వస్తాను.——నమస్కారం చేసి విసురుగా వెళ్ళిపోతుంది.

రా.భ: ఇదుగో అమ్మాయ్.డబ్బులు.

సరో: అక్కర్లేదు. దేశమేమీ గొడ్డుపోలేదు. ఈ కష్టం ఇంకోచోటచేసి బతుకుతాం. –బయట రాజా నక్కి చూస్తూవుంటాడు.

రామభద్రయ్య బైటికివచ్చిరాజాతో: ఒరేఒరే వెళ్ళిపోతోందిరా.

రాజా: ఎక్కడికిపోతుందినాన్నా? తోటకేగా? –దిగులుగాపోతున్న సరోజకి ఎదురైన కార్లో——

లక్ష్మి: సరోజలావుందే? కారు ఆపండి. సరోజా. సరోజా. సరోజా.——కారు దిగివచ్చిసరోజని కౌగిలించుకుంటుంది.

సరో: బేలగా-- అక్కా.——ఏడుస్తూ ఒదిగిపోతుంది.

లక్ష్మి: ఏవిఁటే ఏవిఁటే ఏవిఁటే-పిచ్చిదానా?

సరో: అక్కా.మనం ఇక్కడ ఒక్క క్షణంకూడా ఉండొద్దు. వెళ్ళిపోదాం.

లక్ష్మి: ఏం?

సరో: అక్కా.ఇది రామభద్రయ్యగారి ఇల్లక్కా.

అక్ష్మి: ఐతే ఏం? ఆయన మన మామగారే.

అంజి: చూశావా తమ్ముడూ. ఎంతైనా వాళ్ళూ వాళ్ళూ ఒకటేగా?ఏం గుండత్తా?

గుండ: అక్కడికి మీరూమీరూ ఒకటికాదుకాబోలు.

అంజి సరోజనిచూస్తూ: ఏం పిల్లా. కారు ఆగింది.కాస్త నెట్టుతావ్? మీ చోటికి తీసుకుపోతాం. చలో.చలో. అందరూ నవ్వుకుంటూ రామభద్రయ్య గారిదగ్గరికి వస్తారు.పోర్టికోలోకి. రాజా,సరోజ ఆయన పాదాలకి నమస్కరిస్తారు.

రా.భ: నాకు తెలుసురా. నువ్వు సాధిస్తావని.

అంజి: ఇదుగో నాన్నా. అత్తనికూడా తీసుకువచ్చాం. అల్లుదరికం. అదే నాన్నా. ఇల్లరికానికి ఎదురు. అల్లుదరికం.

రా.భ: ఓహో. అల్లుదరికం.ఆఁ.పదండి.పదండి. అందరూ నవ్వులతో ఇంట్లోకి ప్రవేశిస్తారు.

★★★ (సమాప్తం)



COMMENTS